RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 315 | ఆదివారం | 19 - 05 - 2024 | పేజీలు : 4 | వెల : 5.00

స్టాక్ ట్రేడింగ్ పేరుతో పెరుగుతున్న మోసాలు




2



# 2 కోట్ల ప్రభుత్వ భూమి హాంఫట్

- అనుమతి లేని భారీ అక్రమ షెడ్ ఏర్పాటు
- తెలిసి కూడా పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు
- భారీ స్థాయిలో ముడుపులు చేతులు మారాయని విమర్శలు

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు : కండ్ల ముందే రెండు కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని యదేచ్ఛగా కబ్జా చేసి, అనుమతులు లేని అక్రమ నిర్మాణం చేపడుతున్నా అటు రెవిన్యూ అధికారులు గాని, ఇటు మున్సిపాలిటీ అధికారులు గానీ ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడవలసిన రెవిన్యూ అధికారులు, అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో పలు అనుమానాలకు తావిస్తోంది. పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ, పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 422 లో సుమారు 2000 గజాల ప్రభుత్వ భూమిని యదేచ్ఛగా కబ్జా చేసి ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్ నిర్మాణం చేపట్టి, పూర్తి చేశారు. దీని విలువ ప్రస్తుతం మార్కెట్లో సుమారు 2 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. అంతటి విలువైన ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవు. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతూ చేపట్టిన ఈ నిర్మాణం పూర్తిగా రెవిన్యూ, మున్సిపాలిటీ అధికారుల కనుసన్నాలోనే జరిగిందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని

2



## సీఎం రేవంత్ రెడ్డికి ఝలక్



– కేబినెట్ సమావేశానికి అనుమతివ్వని ఎన్నికల సంఘం

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర ఎన్నికల సంఘం ఝలక్ ఇచ్చింది. గత రెండు రోజుల నుంచి కేబినెట్ సమావేశం అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి

## పోలీసుల అదుపులో మల్లారెడ్డి



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : మాజీ మంత్రి మల్లా రెడ్డిని అదుపు లోకి తీసుకున్నారు పోలీసులు. మలా ్లరెడ్డికి, ఇతరులకు మధ్య భూవివాదం నేపథ్యంలో పోలీసులు ఇద్దరినీ పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుచిత్ర పరిధిలోని సర్వే నెం. 82లోని

# 10 శాతం పెరిగిన రియల్ ఎస్టేట్ ధరలు

- వ్యాపారానికి చిరునామాగా హైదరాబాద్
- సరికొత్త రికార్డులను సృష్టిస్తోన్న రియల్ ఎస్టేట్
- పెరిగిన ధరలకు సంబంధించి క్రెడాయ్ అండ్ కొలియర్స్ లియాసెస్ ఫొరాస్ నివేదిక



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : హైదరాబాద్ స్థిరాస్తి వ్యాపారానికి చిరునామాగా మారింది. గతంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక వెలుగు వెలిగింది. కాంగ్రెస్ అధికా రంలోకి వచిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోతు ందని.. ఇళ్లకు గిరాకీ ఉండదని రకరకాల ప్రచారాలు తెరపైకి వచ్చాయి. అయితే అవన్నీ ఊహాజనితాలని తేలిపో యింది. ఎందుకంటే హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారం సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఇళ్లకు, ప్లాట్లకు, ఫ్లాట్లకు ధరలు పెరగడం.. హైదరాబాద్ కు ఉన్న డిమాండ్ ను తెలియజేస్తోంది. ఇప్పటికే బెంగళూరు నగరంలో సగటున ఇళ్ల ధరలు 19 శాతం పెరగగా.. అదే దారిలో హైదరాబాద్ పయనిస్తోంది. దేశంలోని టాప్ 8 నగరాలలో ఇళ్ల ధరలు అధికంగా పెరగగా.. అందులో బెంగళూరు మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్ కూడా టాప్ -8 జాబితాలో కొనసాగుతోంది.. పెరిగిన ధరలకు సంబంధించి క్రెడాయ్ అండ్ కొరియర్స్ లియాసెస్ ఫొరాస్ ఒక నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం హైదరా బాదులో ఇళ్ల ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. మనదేశంలో ఈ సంవత్సరానికి సంబంధించి జనవరి నుంచి మార్చి త్రైమాసికంలో టాప్ 8 నగరాలలో సగటున 10% ఇళ్ల ధరలు పెరిగాయి.. రెసిడెన్షియల్ ఏ రియల్ ఎస్టేట్ వ్యాపారంపై సానుకూల దృక్పథం కొనసాగుతున్న నేపథ్యంలో ధరలు

2

# రెండు కోట్ల ప్రభుత్వ భూమి హాంఫట్



మొదటిపేజీ తరువాయి

పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఇట్టి విషయాన్ని గతంలో 'ప్రభాత సూర్యుడు' ప్రతినిధి అబ్దుల్లాపూర్ మెట్ మండల తహసిల్దార్ రవీంద్ర దత్తు దృష్టికి తీసుకెళ్లగా పట్టా భూమికి ఆనుకొని సరిహద్దులో సర్వే నెంబర్ 422 ప్రభుత్వ భూమి ఉంటుందని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని గతంలో తెలిపారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, నిర్మాణం మాత్రం పూర్తయింది. ఇదే అంశాన్ని శనివారం మళ్లీ తహసీల్దార్ తో ఫోన్లో ప్రస్తావించే ప్రయత్నం చేయగా స్పందించలేదు. ఇప్పటికైనా దీనిపై రెవిన్యూ, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# 10 శాతం పెరిగిన రియల్ ఎస్టేట్ ధరలు



మొదటిపేజీ తరువాయి

పెరుగుతున్నట్టు తెలుస్తోంది.. బెంగళూరు నగరంలో ఈ ఏడాది ఇళ్ల ధరలు, గత ఏడాదితో పోలిస్తే 19 శాతం పెరిగాయి. ఇళ్ల ధరల పరంగా దేశం మొత్తం మీద ఈ 8 నగరాలలోనే అధికంగా ఉండడం విశేషం. బెంగళూరులోని ఫెరిఫెరీ అండ్ ఔటర్ ఈస్ట్ మైక్రో మార్కెట్ లో ఇళ్ల ధరలు 32 శాతం పెరిగాయి. దీని తర్వాత ఫెరిఫెరీ అండ్ అవుటర్ నార్త్ మార్కెట్లో సగటున 18% ధరలు పెరిగాయి. ఇక వైట్ ఫీల్డ్, కె ఆర్ పురం వంటి ప్రాంతాలలో త్రిబుల్ బెడ్ రూమ్, క్వాడ్రా ఫుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ ఉంది..బెంగళూరు అనంతరం ఢిల్లీలోని ఎన్ సీ ఆర్ ప్రాంతంలో ఇళ్ల ధరలు 16 శాతం పెరిగాయి. ధరలపరంగా ఇది రెండవ స్థానంలో ఉంది. ద్వారక ఎక్స్ ప్రెస్ వే పరిధిలో ఇళ్ళ ధరలు 23% పెరిగాయి. హైదరాబాదులో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఇళ్ల ధరలు సగటున తొమ్మిది శాతం పెరిగాయి. ఇక గత ఏడాది అక్టోబర్ డిసెంబర్ సమయంలో పోలిస్తే ఇప్పుడు రెండు శాతం మాత్రమే పెరుగుదల కనిపించింది. ఇక గత త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత త్రైమాసికంలో ధరలు పెరిగిన జాబితాలో అహ్మదాబాద్ తొలి స్థానంలో ఉంది. ఇక్కడ ఏడు శాతం మేర ధరలు పెరిగాయి..కోల్ కతా లో ఇళ్ల ధరలు రెండు శాతం తగ్గాయి. చెన్నైలో ఎటువంటి మార్పులు లేవు. ఏడాది ప్రాతిపదికన చూసుకుంటే ఇళ్ల ధరలు చెన్నైలో నాలుగు శాతం పెరిగాయి.విద్య, ఉద్యోగం, కెరియర్ ఈ మూడు అంశాలకు ప్రాధాన్యం పెరగడంతో చాలామంది నగరాలలో జీవించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా నగరంలో భూమి మీద పెట్టుబడి పెడితే అనేక రెట్ల లాభాలు కళ్ళ చూసే అవకాశం ఉండడంతో చాలామంది ప్లాట్లు, ఫ్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక బ్యాంకులు కూడా రుణాల మంజూరును సులభతరం చేయడంతో గృహాల కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి.

# పోలీసుల అదుపులో మల్లారెడ్డి



మొదటిపేజీ తరువాయి

తమ భూమిని కబ్జా చేస్తున్నారంటూ మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమి చుట్టూ అక్రమంగా ఫెన్సింగ్ వేశారని మల్లారెడ్డి పోలీసులకు చెప్పారు. వేసిన ఫెన్సింగ్‌ను కూల్చాలంటూ అనుచరులకు చెప్పారు మల్లారెడ్డి. దీంతో అనుచరులు ఈ ఫెన్సింగ్ మొత్తం నేలకూల్చారు. వివాదంలోని భూమిలో ఘర్షణకు దిగొద్దని ఇద్దరికీ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు పోలీసులు. దీనిపై పోలీసులతో పెద్దగా వాగ్వాదానికి దిగారు మల్లా రెడ్డి. తమ భూమిలో ఫెన్సింగ్ వేస్తే చూస్తూ ఎలా ఊరుకున్నారంటూ పోలీసులను నిలదీశారు. కేసు పెడితే పెట్టుకోండి.. తన స్థలాన్ని కాపాడుకుంటానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల ముందే మల్లారెడ్డి అనుచరులు ఫెన్సింగ్‌ను కూల్చి వేశారు. గతంలోకూడా ఆ భూమి మాదేనంటూ 15 మంది బయటకు వచ్చారన్నారు. ఇదిలా ఉంటే ఫెన్సింగ్ వేసిన వాళ్లు పోలీసులతో స్థలంపై స్పష్టత ఇచ్చారు. ఒక్కొక్కరు 400 గజాల చొప్పున 1.11 ఎకరాల భూమిని కొన్నామన్నారు. కోర్టు కూడా తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని కోర్టు ఆరర్?ను పోలీసులకు చూపించారు. స్థలంపై కోర్టు ఆర్డర్ ఉన్నందున సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని పోలీసులు ఇరువురికి సూచించారు. ఇదే క్రమంలో మల్లా రెడ్డి అనుచరులు ఫెన్సింగ్‌ను కూల్చి వేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే పరిస్థితి సర్దుమణిగేందుకు మాజీ మంత్రి మల్లారెడ్డిని బషీర బాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి ఝలక్

మొదటిపేజీ తరువాయి

తీవ్ర నిరాశే ఎదురైంది. ఇవాళ సాయంత్రం సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగుతుందని రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక వైపు లోక్‌సభ ఎన్నికల కోడ్, మరో వైపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రేవంత్ కేబినెట్ సమావేశానికి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వలేదు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశం ఉందంటూ ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ నెల 27న ఖమ్మం - వరంగల్ - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పోలింగ్ జరగనుంది. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల కోడ్ ముగియనుంది.

# మే 23 వరకు అతి భారీ వర్షాలు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణ, ఏపీలో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 22న నైరుతీ బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం బలపడి మే 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా శ్రీలంక వరకు ఉపరితల ద్రోణి ఆవరించింది. సముద్రమట్టానికి 3.1 కి.మీ. ఎత్తున ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. తమిళనాడులోని ఉత్తర ప్రాంతాల వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించింది. ఈ నెల 23వ తేదీ వరకు ఏపీ, తెలంగాణలో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దక్షిణ అండమాన్ సముద్రంలో నైరుతీ రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. రేపటికి బంగాళాఖాతంలో ఆగ్నేయ ప్రాంతాలపై నైరుతీ రుతుపవనాలు విస్తరించనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

# స్టాక్ ట్రేడింగ్ పేరుతో పెరుగుతున్న మోసాలు

## - స్టాక్ ట్రేడింగ్ పేరుతో వచ్చే మోసాలతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న పోలీసులు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : ఆన్లైన్లో ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రతిరోజు ట్రేడింగ్ పేరుతో వస్తున్న మోసాలను పోలీసులు అనలైజ్ చేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలోనే తెలంగాణ వ్యాప్తంగా సుమారు 213 మంది బాధితులు ట్రేడింగ్ బారినపడి మోసపోయినట్లు పోలీసులు విచారణలో బయటపడింది. ట్రేడింగ్ ఎలా చేయాలో మొదలుపెట్టి ఎక్కువ మొత్తంలో లాభం వస్తుందని నమ్మించి అధిక మొత్తం పెట్టుబడి పెట్టేలాగా బాధితులను ప్రేరేపిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యాపారికి మార్చి 11న ఇంటర్నేషనల్ స్టాక్ ట్రేడింగ్ అకౌంట్ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. ట్రేడింగ్ చేయాలో సలహాలు ఇస్తామంటూ మొదలైన సంభాషణ అధిక పెట్టుబడులు పెట్టేంతవరకు బాధితుడిని ప్రేరేపించారు. దీంతో వారి సలహాలు సూచనలు విన్న తర్వాత పలు దఫాలుగా రూ. 30 లక్షల రూపాయలను వీరు చెప్పిన ఖాతాకు బదిలీ చేశారు. ఆ డబ్బులు కాస్త రెట్టింపు కావడంతో బాధితుడు సైతం ఇది నిజమేమోనని నమ్మాడు. అలా మొత్తం రూ.13 కోట్ల వరకు లాభం చూపించారు. ఆన్లైన్ అప్?లో చూపిస్తున్న రూ.13 కోట్ల రూపాయలలో ఐదుకోట్ల రూపాయలను తన బ్యాంక్ ఖాతాకు విత్ డ్రా చేసుకోవాలని బాధితుడు భావించాడు. అయితే విత్ డ్రా కోసం టాక్స్ రూ.1.3 కోట్లు చెల్లించాలని నేరగాళ్లు బాధితుడిని నమ్మించారు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు తిరిగి వారిని ప్రశ్నించడంతో బాధితుడి నంబర్‌ను బ్లాక్ చేశారు. పెట్టుబడి పెట్టిన డబ్బు మొత్తం నేరగాళ్ల బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ అయింది. ఇలా స్టాక్ ట్రేడింగ్ పేరుతో వస్తున్న మెసేజ్‌లు, ప్రకటనలు, లింకులు క్లిక్ చేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో ట్రేడింగ్‌కు విపరీతంగా డిమాండ్ పెరిగింది. దీంతో ట్రేడింగ్ గురించి అవగాహన లేని వారు ఈజీగా మోసపోతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. స్టాక్ ట్రేడింగ్ పేరుతో వచ్చే మోసాలతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ డిమాట్ అకౌంట్ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఆన్లైన్ ట్రేడింగ్ పేరుతో పదే పదే మెసేజ్లు వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని హెచ్చరిస్తున్నారు. గత ఏడాది స్టాక్ ట్రేడింగ్ పేరుతో తెలంగాణ వ్యాప్తంగా 600 మంది బాధితులు మోసపోయారు. మీరు వద్ద నుండి సుమారు మూడు కోట్ల రూపాయలు సైబర్ నేరగాళ్లు కొట్టేసినట్లు పోలీసులు తెలిపారు. ఏడాది రెండు నెలల వ్యవధిలోనే రూ. 27 కోట్ల రూపాయల డబ్బును ట్రేడింగ్ పేరుతో కొట్టేశారు.

# హస్తగతమయిన నార్సింగి మునిసిపాలిటీ

రంగారెడ్డి జిల్లా, ప్రభాత సూర్యుడు : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు నార్సింగి మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ పార్టీ నేతలు హస్త గతం చేసుకున్నారు. ఇటీవలే నార్సింగి బిఆర్ఎస్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్ లపై 12 మంది కౌన్సిలర్ లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం అందరికీ తెలిసిందే. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఆర్డిఓ వెంకటరెడ్డి నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నార్సింగి మున్సిపాలిటీలో మొత్తం 18 మంది కౌన్సిలర్లు ఉండగా క్యాంపు నుండి నేరుగా వచ్చిన 10 మంది కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, 2 బిజెపి కౌన్సిలర్లు,2 ఇతర కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేశారు.4 మంది బి ఆర్ ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి గైహాజరయ్యారు.

RNI: TELTEL12215
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# బెర్తుల కోసం లాబీయింగ్

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో బెర్తల కోసం అప్పుడే లాబీయింగ్ మొదలైందా? చోటు దక్కని సీనియర్లు ఈసారి మంత్రి పదవులపై కన్నేశారా? దీనికోసం ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని భావిస్తున్నారా? వివిధ జిల్లాల నుంచి కీలక నేతలు రేసులో ఉన్నారా? తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ పెద్దలతో పలువురు సీనియర్లు మంతనాలు జరిపినట్టు సమాచారం. కాకపోతే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తర్వాత ఈ అంశం ఓ కొలిక్కిరావచ్చని తెలుస్తోంది. అంతా అనుకున్నట్లు జరిగితే జూన్ చివరలో కేబినెట్ విస్తరణ ఉంచవచ్చనే సంకేతాలు లేకపోలేదు. ఈసారి ఏ జిల్లాకు ప్రాధాన్యత ఇస్తారనేది తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్ హాట్‌గా చర్చ జరుగుతోంది. రాజ్యాంగం పద్ధతి ప్రకారం సీఎంతో కలిసి 18 మందికి మించరాదు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో కలిసి 12 మంది మంత్రులున్నారు. మరో ఆరుగురు ఛాన్స్ ఉందన్నమాట. హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఛాన్స్ ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీసీ, ముదిరాజ్, మైనార్టీ వర్గాలతో కలిసి మొత్తం ఆరుగురికి అవకాశం ఇవ్వడం ఖాయం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా పదవులు ఉంటాయని గతంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు చెప్పుకొచ్చారు. సరైన పనితీరు కనబరచని



మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. రేవంత్ కేబినెట్‌లో ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులున్నారు. నల్గొండ, వరంగల్, కరీంనగర్ నుంచి ఇద్దరేసి మంత్రులున్నారు. ఖమ్మం నుంచి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉన్నారు. నల్గొండ నుంచి ఉత్తమ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్క, కరీంనగర్ నుంచి పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఉన్నారు. ఇక హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేలు ఎవరు లేరు. బీఆర్ఎస్ నుంచి ఎవరైనా వస్తే వారికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇక రంగారెడ్డి జిల్లా విషయానికొస్తే పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ రేసులో ఉన్నారు. ఈ వ్యవహారమంతా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే జరగనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జులైలో జరగాలి. కానీ ఆ సమయంలో జరిగే ఛాన్స్ లేదు. ఎందుకంటే రైతుబంధు పథకానికి నిధులు ఆగస్టులో వేస్తామని రేవంత్ సర్కార్ చెప్పింది. ఆ లెక్కన చూస్తే సెప్టెంబరులో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగడం ఖాయమని పలువురు నేతలు చెబుతున్నమాట.

# మోడీ వ్యాఖ్యలను ఖండించిన మంత్రి పొన్నం



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : ఉచిత బస్సు సౌకర్యాల పై ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యల పై మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేయడాన్ని ప్రధాన మంత్రి స్థాయిలో జీర్ణించుకోలేక పోతున్నారు. కొన్ని రాష్ట్రాలు అక్కడ ఉన్న పరిస్థితుల దృష్ట్యా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాయి. వాస్తవంగా ఆర్టీసి లో ప్రయాణానికి.. మెట్రో ప్రయాణానికి సంబంధం లేదు. మెట్రో సెక్టార్ వేరు. ఇప్పటికీ కూడా మెట్రో లో బోగి లు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రధాన మంత్రి రు రాజకీయ లబ్ధికి సంబంధించిన ఆలోచన చేస్తున్నారా....? బస్సు ప్రయాణం విషయంలో ప్రధాన మంత్రి ఎందుకు అలా మాట్లాడారు. తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం విషయంలో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఇంకా రూట్లు పెంచి కొత్త బస్సులు పెంచి పథకాన్ని మరింత ముందుకు తీసుకుపోతాం. ఇంకా మరిన్ని సౌకర్యాలు కల్పించడంలో మా ప్రయత్నాలు మరింత కొనసాగుతాయని అన్నారు. ప్రధాన మంత్రి మహిళలకు బస్సు సౌకర్యం పై ఆడిపోసుకోవడం బంద్ చేసుకోవాలి. ఉచితంగా బస్సు సౌకర్యం ఇచ్చినంత మాత్రాన ఏదో నష్టం జరుగుతున్నట్లు మాట్లాడడం సరికాదు అన్నారు.

# అగ్రికల్చర్ టాప్ 10 వీరే

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : టీఎస్ ఎప్‌సెట్ -2024 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి కలిసి విడుదల చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 89.66 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇందులో అమ్మాయిలో 90.18 శాతం, అబ్బాయిలు 88.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు 91,633 మంది విద్యార్థులు హాజరు కాగా, 82,163 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో టాప్ టెన్‌లో ముగ్గురు అమ్మాయిలు నిలిచారు. తొలి ర్యాంకర్ ఆలూరు ప్రణీత. ఆమె ఏపీకి చెందిన విద్యార్థిని.

# బస్సు కిందపడి మహిళ మృతి




ఖమ్మం, ప్రభాత సూర్యుడు : ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సులో నుండి మహిళ జారిపడ్డారు. అయితే క్రింద పడిన మహిళపై నుంచి బస్సు వెనుక టైర్ ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొణిజర్ల మండలం పెద్దమనగాల గ్రామానికి చెందిన దూరి అనూష (26 )అనే మహిళ సామాన్య వ్యవసాయ కూలి గా ఉన్నారు. అనూష ఖమ్మంలో డి మార్ట్ లో పనిచేస్తుంది. ప్రతిరోజు లానే పెద్దమునగాల నుండి ఖమ్మం తాను పనిచేసే షాపుకు వెళ్లడానికి కొణిజర్లలో భద్రాచలం డిపోకు చెందిన టీఎస్ 28 జెడ్ 00 91 వన్ బస్సు ఎక్కారు. బస్సు బయలుదేరిన కొద్ది చేపట్టకే ఎంపీడీవో కార్యాలయం వద్ద బస్సులో నుంచి అనుష జారిపడి మృతి చెందింది. మృతి చెందిన మహిళకు మనస్విత, వినన్య అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనితో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# భూముల ధరలకు రెక్కలు

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు వివిధ సంక్షేమ పథకాల అమలుకు నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న తెలంగాణలోని రేవంత్‌రెడ్డి సర్కార్ ఆదాయం పెంపుపై దృష్టిపెట్టింది. లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో సీఎం రేవంత్ సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారు. దీంతో భూముల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచేందు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులతో సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను నాటి కేసీఆర్ సర్కార్ పెంచింది. ఇప్పటికీ అవే అమలవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్ విలువకు, వాస్తవిక ధరకు మధ్య భారీగా వ్యత్యాసం ఉన్నట్లు సీఎం అభిప్రాయపడ్డారు. నిబంధనల సాకుతో రేవంత్ సర్కార్ భూము ధరలకు రెక్కలు తీసుకురావాలి చూస్తోంది. ఇప్పటికే సామాన్యుడు ఇంటి స్థలం కొనుగోలు చేసే పరిస్థితి తెలంగాణలో లేకుండా పోయింది. పెంచిన భూములు, రిజిస్ట్రేషన్ ధరలతో చాలా మంది భూముల కొనుగోలుకు వెనుకాడుతున్నారు. సొంత ఇంటి కల, కలగానే మిగిలిపోతోంది. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ నిబంధనల సాకుతో భూముల ధరలు పెంచాలని చూస్తున్నారు. ఏడాదికి ఒకసారి భూముల ధరలు సవరించాలన్న నిబంధనను అమలు చేయాలని నిర్ణయించారు. ధరల సవరణకు చర్యలు



చేపట్టాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆదాయం పెంపుతోపాటు స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా భూముల ధరలు మార్కెట్ ధరలకు అనుగుణంగా సవరించాలని తెలిపారు. ఇక భూముల ధరలతోపాటు స్టాంప్ డ్యూటీ కూడా పెంచడమో, తగ్గించడమో చేయాలి రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఈ విషయంలో ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానంపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి వినియోగించే స్థలాల ధరలను సవరించాలని సీఎం ఆదేశించారు. ఈమేరకు ఏయే ప్రాంతాల్లో ఎంత పెంచాలో గుర్తించాలని కూడా సూచించారు. శాస్త్రీయంగా, రిజిస్ట్రేషన్ స్టాంపు లశాఖ నిబంధనల ప్రకారం.. ధరల సవరణ ఉండాలని తెలిపారు.

# అవిశ్వాసానికి సిద్ధమయిన ఎల్లారెడ్డి మునిసిపల్ ఛైర్మన్ పీఠం

కామారెడ్డి, ప్రభాత సూర్యుడు : ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పీఠం ప్రస్తుతం అవిశ్వాసానికి సిద్ధమైంది... మొదటిసారి మున్సిపల్ చైర్మన్ గా పదవిబాధ్యతలు స్వీకరించిన కుడుముల సత్యనారాయణ ఐదేళ్ల పదవీకాలం పూర్తికాకముందే అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. మరికాసేపట్లో అవిశ్వాస సమావేశానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. టిఆర్ఎస్ పార్టీ నుంచి ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే జజాల సురేందర్ ఆశీర్వాదంతో చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కుడుముల సత్యనారాయణ ఇటీవల కాలంలో ఆ పార్టీని వీడి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరగానే మిగతా కౌన్సిలర్లు చైర్మన్ పై అవిశ్వాసానికి అవకాశం కల్పించాలని కోరుతూ గత నెల 24న జిల్లా కలెక్టర్ జితిష్ పాటిల్ ను కలిసి అవిశ్వాసం నోటీసులు అందజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 18వ తారీఖున మున్సిపల్ చైర్మన్ పై విశ్వాసం పెట్టేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఓ నాయకుడు క్యాంపు ఏర్పాటు చేసారు. ఈ క్యాంపుకు తరలిన 11 మంది కౌన్సిలర్లు నేడు నిర్వహించే సమావేశానికి నేరుగా చేరుకొనున్నారు. చైర్మన్ కుడుముల సత్యనారాయణ పై మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, కౌన్సిలర్లు గుర్రుగా ఉండడంతో ఈ అవిశ్వాసం నెగ్గడం ఖాయమని పలువురు భావిస్తున్నారు. కాగా ప్రస్తుత ఎమ్మెల్యే మదన్మోహన్ అండతో ఈ అవిశ్వాసాన్ని వీగేలా కుడుముల సత్యనారాయణ ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా హైకోర్టు కి మున్సిపల్ చైర్మన్ వెళ్లిన లాభం లేకుండా పోయింది. అవిశ్వాసాన్ని వాయిదా వేయాలని వేసిన పిటిషన్ ని కోర్టు తిరస్కరించింది. అయితే వివరాలు తదుపరి తీర్పు వరకు వెల్లడించారాధాని తీర్పు ఇచ్చింది. కాగా ఈ అవిశ్వాసం నెగ్గుతుందా వీగుతుందా అని వివిధ రాజకీయ పార్టీలతో పాటు మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ఎడిటోరియల్ EDITORIAL

# జీవజాతులు అంతరిస్తే జీవవైవిధ్యానికి విఘాతం..!

ప్రభాత సూర్యుడు : "సమస్త వణ్యప్రాణులు గ్రంధాలయంలో చదివిన, చదవని పుస్తకాల లాంటివి. వణ్యప్రాణులను గుర్తించక పూర్వమే వాటి వినాశనం జరిగితే పుస్తకాలను చదవకుండానే గ్రంధాలయం అగ్నికి ఆహుతి అయినట్లు భావించాలని" అని ప్రముఖ శాస్త్రజ్ఞుడు జాన్ దిన్‌జల్ అభిప్రాయపడ్డారు. వన్యప్రాణులను అంతరించకుండా కాపాడుకోవడం, వాటి జనాభా తగ్గకుండా చూడడం, జీవ వైవిధ్యాలను పరిరక్షించడం అనే లక్ష్యంతో "డిజిటల్ పరిజ్ఞానంతో వన్యప్రాణుల రక్షణ" అనబడే నినాద అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం మన కర్తవ్యం కావాలి. వన్యప్రాణి శరనార్థి జీవజాతులు, జంతు ప్రదర్శనశాలలు, మ్యూజియమ్స్, నందనవనాలు, పౌర సంఘాలు, యన్‌జిఓలు, విద్యావేత్తలు, నిపుణులు, జంతు ప్రేమికులు లాంటి వర్గాలు అంతరించే ప్రమాదపు అంచున ఉన్న జీవజాతుల పరిరక్షణ, పునరుద్ధరణ ప్రయత్నాలు, అవగాహన లాంటి వివిధ కార్యక్రమాలు రూపొందించడానికి ఈ వేదికలు వినియోగపడతాయి. భూమండలంపై జీవరాసుల ఆవిర్భావం నుంచి నేటి వరకు అనేక రకాలైన జీవజాతులు భౌతిక శారీరక పరివర్తనం, బయలాజికల్ స్థితులు, వాతావరణ మార్పులను బట్టి నెమ్మదిగా అంతరించడం ప్రకృతి నియమంగా జరుగుతూనే ఉన్నది. నేటి డిజిటల్ యుగపు మానవుడు చేస్తున్న వికృత పర్యావరణ వ్యతిరేక కార్యాలతో వేగంగా పలు జీవజాతుల అంతరిస్తున్నాయని, అంతరించే ప్రమాదపు లేదా విలుప్తత లేదా విపత్తు అంచున ఉన్నాయనే విషయం జంతు ప్రేమికులను కలవరపెడుతున్నది. మానవ ప్రమేయంతో అతివేగంగా అంతరించే ప్రమాదపు అంచున ఉన్న జీవజాతులను 'విపత్తు లేదా అంతరించే అంచున ఉన్న జీవజాతులు(ఎండేంజర్డ్ స్పీసీస్)' అంటాం. అడవు నరికివేత, కార్చిచ్చులు, వాతావరణ ప్రతికూల మార్పులు, వణ్యప్రాణి అక్రమ రవాణా లాంటి పలు కారణాలతో అంతరించే అంచున జీవజాతులు ఉండడం విచారకరం. అంతరించే దుస్థితిలో ఉన్న జీవజాతులను గుర్తించి వాటి పరిరక్షణకు కంకణబద్ధులం కావాలని, లేని యెడల జీవవైవిధ్యానికి విఘాతం కలిగి ప్రాణికోటి మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. అంతరించే జాతులను గుర్తించడానికి కొన్ని ప్రమాణాలను నిర్ణయించారు. ఒకేరకమైన జీవజాతి 10 ఏళ్లలో 50-70 శాతం జనాభా తగ్గడం, జీవజాతుల నివాసాల వైశాల్యం పూర్తిగా తగ్గడం, జీవజాతి జనాభా 2,500 వరకు తగ్గడం, జీవజాతి జనాభా 250 ఉన్నప్పుడు రానున్న రెండు దశాబ్దాల్లో అవి అంతరిస్తాయని గమనించాలి. సమస్త జీవజాతుల్లో 27 శాతం, అనగా 41,000 జాతులు అంతరిస్తున్నాయని గణాంకాలు తెలువుతున్నాయి. మానవ అనాలోచిత ప్రమేయం, సహజ నివాస స్థలం ప్రభావితం కావడం, కొత్త జీవజాతులను సహజ నివాసాల్లో వదలడం, అతి వేట, కాలుష్యం, జీవజాతులకు రోగాలు, అడవుల నరికివేత, ప్రపంచ జనాభా పెరగడం, అపరిమిత ప్రణాళికారహిత పట్టణీకరణ, అర్థరహిత అభివృద్ధి, వాతావరణ ప్రతికూల మార్పులు, జన్యుపరమైన మార్పులు వంటి కారణాలతో పలు జీవజాతులు వేగంగా అంతరిస్తున్నాయని గమనించారు. రానున్న రెండు దశాబ్దాల్లో కనీసం 500లకు పైగా జీవజాతులు అంతరిస్తాయని కూడా విశ్లేషిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అంతరించే ప్రమాదపు అంచున ఉన్న జీవజాతుల్లో జవన్ రీనో, అముర్ లిపర్డ్, సుంద ఐలాండ్ టైగర్, మౌంటేయిన్ గొరిల్లాస్, టపనులీ ఒరంగుటన్, పర్పోయిస్, బ్లాక్ రీనో, ఆఫ్రికన్ ఎలిఫంట్, సుమంత్రన్ ఒరంగుటన్, హాక్సబిల్ టర్‌టిల్స్ లాంటివని జాబితాలో ముందు వరుసలో వస్తాయి. 2011లో భారతదేశంలో 47 జీవజాతులు తీవ్రంగా అంతరించే దుస్థితిలో ఉన్నాయని, 2018లో ఇండియా తయారు చేసిన ఐయుసియన్ రెడ్ లిస్ట్‌లో 132 వృక్షజీవజాతులు (క్రిమి కీటకాలు, పక్షులు, చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, క్షీరదాలు లాంటి వర్గ) అంతరించే ప్రమాదపు అంచున ఉన్నట్లు తెలిపారు. వీటిలో 73 జాతులు (9 క్షీరదాలు, 18 పక్షులు, 26 సరీసృపాలు, 20 ఉభయచరాలు) తీవ్రంగా అంతరించే ప్రమాదపు (క్రిటికల్లీ ఎండేంజర్డ్ స్పీసీస్) జీవజాతులు ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. అధిక జనసాంద్రత కలిగిన ఇండియాలో బెంగాల్ టైగర్, ఏసియటిక్ లయన్, స్నో లిపర్డ్, వన్-హర్నుడ్ రీనో, బ్లాక్‌బక్, లయన్-టెయిల్డ్ మకాక్యూ, ట్రీ ఫ్రాగ్, కాశ్మీరి రెడ్ స్టాగ్, నిల్‌గిరి టెహర్, ఇండియన్ బైసన్(గౌర్) లాంటివి అంతరిస్తున్న జాబితాలో ఉన్నాయని తెలుస్తున్నది. పటిష్టమైన వన్యప్రాణి పరిరక్షణ చట్టాలు చేయడం, చట్టాలను నిక్కచ్చిగా అమలుపరచడం, అడవుల పరిరక్షణ, జంతు వేటను కట్టడి చేయడం, అభయారణ్యాల ఏర్పాటు, అడవులకు కంచెలు వేయడం, జాతీయ వనాల ఏర్పాటు, రిజర్వ్ ఫారెస్టుల పరిరక్షణ, అంతరించే జాతులకు ప్రత్యేక ప్రాజెక్టులు (ప్రాజెక్ట్ టైగర్, ప్రాజెక్ట్ ఎలిఫంట్ లాంటివి) ఏర్పాటు చేయడం, అక్రమ రవాణాను కట్టడి చేయడం, సుస్థిరాభివృద్ధికి మార్గాలు వేయడం లాంటి చర్యలు అంతరించే ప్రమాదంలో ఉన్న జీవజాతులకు జీవం పోసినట్లు అవుతుందని తెలుసుకోవాలి.

# పోలింగ్ అల్లర్లపై నివేదికకు సిట్ ఏర్పాటు

- ఈ స్థాయిలో హింస జరగడం ఇదే మొదటిసారి
- కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం
- ఏసీబీ, సిఐడి ఇతర 13 విభాగాల అధికారులతో సిట్ ఏర్పాటు
- అల్లర్లకు కారణమైన పోలీసులు, రాజకీయ నాయకులపైనా కఠిన చర్యలు తీసుకునే అవకాశం




ప్రభాత సూర్యుడు : అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో గతంలో ఎన్నడు లేని విధంగా పోలింగ్ తర్వాత హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పోలింగ్ రోజు, పోలింగ్ ముగిసిన తరువాత మూడు జిల్లాల్లోని నాలుగు ప్రాంతాల్లో తీవ్రస్థాయిలో హింసాత్మక ఘటనలు జరిగాయి. రాష్ట్ర చరిత్రలో పోలింగ్ ముగిసిన తర్వాత ఈ స్థాయిలో హింస జరగడం ఇదే మొదటిసారి. ఎన్నికల కమిషన్ అధికారులు హెచ్చరించినప్పటికీ క్షేత్రస్థాయిలో పోలీసుల వైఫల్యం వల్లే భారీగా హింసాత్మక ఘటనలు జరిగాయని సిఎస్ జవహర్ రెడ్డి ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందించారు. పల్నాడు జిల్లాలోని మాచర్ల, నరసరావుపేట, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, ప్రతి జిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గాల్లో తీవ్రస్థాయిలో హింస జరిగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఈసీ పర్యవేక్షణలో శాంతిభద్రతలు ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలు జరగడంపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. స్వయంగా సిఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాలను ఢిల్లీ పిలిపించి వివరణ తీసుకుంది. సిఎస్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇద్దరు ఎస్పీలపై సస్పెన్షన్ వేటు వేసింది. పల్నాడు, అనంతపురం జిల్లాల ఎస్పీలను సస్పెండ్ చేయడంతో పాటు వారిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. ఇక పల్నాడు జిల్లా కలెక్టర్, తిరుపతి జిల్లా ఎస్పీలను బదిలీ చేసి వారిపై శాఖా పరమైన చర్యలకు ఈసీ ఆదేశించింది. క్షేత్రస్థాయిలో మరో ఐదుగురు డిఎస్పీలు, ఐదుగురు సిఐలు, ఇద్దరు ఇన్స్పెక్టర్లపైన సస్పెన్షన్ వేటు వేసింది. అంతేకాకుండా సిట్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయి విచారణ జరిపి రెండు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈసీ ఆదేశాలతో ఐజి వినీత్ బ్రిజ్ లాల్ నేతృత్వంలో 13 మంది సభ్యులతో సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి భద్రతల విభాగంలో పనిచేస్తున్న అధికారులు కాకుండా ఏసీబీ, సిఐడి ఇతర విభాగాల అధికారులతో సిట్ ఏర్పాటయింది. ఎన్నికల హింసపై సిట్ ఐజీ వినీత్ బ్రిజ్ లాల్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశారు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా. లా అండ్ ఆర్డర్‌లో ఉన్న పోలీసులతో కాకుండా ఏసీబీ, సిఐడి,ఇతర విభాగాల్లోనీ అధికారులు సభ్యులుగా సిట్ ఏర్పాటైంది. సిట్‌లో సభ్యులుగా ఏసీబీ ఎస్పీ రమాదేవి, ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌమ్యలత, ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి(శ్రీకాకుళం), సీఐడీ డీఎస్పీ శ్రీనివాసులు, ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు(ఒంగోలు), ఏసీబీ డీఎస్పీ మనోహరాచారి(తిరుపతి), వి.భూషణం(గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్), వెంకటరావు(విశాఖ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్), రామకృష్ణ(ఏసీబీ ఇన్‌స్పెక్టర్), జి.ఎల్.శ్రీనివాస్(ఏసీబీ ఇన్‌స్పెక్టర్), మోయిన్(ఒంగోలు పీటీసీ), ప్రభాకర్(అనంతపురం ఏసీబీ), శివప్రసాద్(ఏసీబీ ఇన్‌స్పెక్టర్) ఉన్నారు. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో పోలింగ్ రోజు.. ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై సిట్ విచారణ చేయనుంది. ఆయా జిల్లాల్లో ఇవాళ, రేపు క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లనున్న సిట్ బృందం.. ఆయా ప్రాంతాల్లో విచారణ జరుగుతున్న తీరును పర్యవేక్షించనుంది. అవసరమైనచోట్ల అదనపు సెక్షన్లు పెట్టడానికి తగిన ప్రతిపాదనలు చేయడంతోపాటు ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లు నమోదు అయినచోట అవసరమైతే కొత్తగా ఎఫ్ఐఆర్లు నమోదుకు ఆదేశాలు జారీ చేయనుంది. రెండు రోజుల్లోగా పూర్తిస్థాయి నివేదికను తమకు సమర్పించాలన్న ఈసి ఆదేశాలతో వెంటనే తమ పని ప్రారంభించేలా సీట్ ముందుకెళ్తుంది. సిట్ నివేదిక ఆధారంగా కేంద్ర ఎన్నికల కమిషన్ తదుపరి చర్యలు తీసుకోనుంది.

# లండన్‌లో ఎయిర్‌పోర్టులో దిగిన సీఎం జగన్

ప్రభాత సూర్యుడు : అమరావతి : విదేశి పర్యటనలో భాగంగా ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శనివారం లండన్‌కు చేరుకున్నారు. నిన్న రాత్రి ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి బయలు దేరిన జగన్ దంపతులు ఉదయం లండన్‌లోని లూటన్ ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు జగన్‌కు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు వద్ద జగన్ అభిమానులు ఆయన కరచాలనం చేసి సెల్ఫీలు దిగారు. ఏపీలో ఎన్నికలు జరిగిన తరువాత వైఎస్ జగన్ సీబీఐ కోర్టు అనుమతితో విదేశాల్లో పర్యటిస్తున్నారు. ఈనెల 31 వ తేదీ వరకు ఆయన లండన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ దేశాల్లో పర్యటించనున్నారు. విజయవాడలో జగన్‌కు మంత్రులు జోగి రమేష్, కొట్టు సత్యనారాయణ, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ విప్‌లు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్ కుమార్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిలు సెండాఫ్ ఇచ్చారు.



**- గంటకు రూ.12 లక్షలు?**

వైఎస్ జగన్ కుటుంబ సమేతంగా లండన్ పర్యటనకు వెళ్లారు. వాస్తవానికి ఇది వ్యక్తిగత పర్యటన అని చెబుతున్నారు. అటువంటప్పుడు ప్రభుత్వ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకూడదు. కానీ ఆయన రక్షణ కోసం కోట్ల రూపాయలను ఖర్చుపెట్టాల్సి వస్తోంది. దాదాపు రెండువారాలు అక్కడే ఉండి జూన్ ఒకటిన తిరిగిరానున్నారు. విస్టా జెట్ కంపెనీకి చెందిన బొంబార్డియర్ 7500 అనే అత్యంత విలాసవంతమైన విమానాంలో జగన్ లండన్ వెళ్లారు. దాని ఖర్చు గంటకు రూ.12 లక్షలు. అంటే గంటకు రూ.12 లక్షలు ఖర్చుపెట్టే వ్యక్తి పేదవాడా? పెత్తందారా? అంటూ తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు ప్రశ్నిస్తున్నారు. పవన్ కల్యాణ్ లేకపోతే టీడీపీకి ఎన్ని సీట్లు వస్తాయో తెలుసా..? ఖర్చంతా ప్రభుత్వమే భరించాలి.. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి జగన్ కు రక్షణగా ఇప్పటికే నలుగురు అధికారులు లండన్ వెల్లారు. వారికి విమాన టికెట్లు, వసతి, ఇతరత్రా ఖర్చులు కలిపి రూ.కోటిన్నర అవుతోంది. ఈ ఖర్చంతా ప్రభుత్వమే భరించాలి. సీఎం జగన్ వ్యక్తిగత పర్యటన కాబట్టి ఆయన వరకు ఆయన ఖర్చుపెట్టుకున్నా భద్రతా సిబ్బంది ఖర్చు మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. అంతేకాకుండా చేజేతులా ప్రతిపక్ష పార్టీలకు విమర్శనాస్త్రాలను చేతికి అందిం చినట్లవుతోందని వైసీపీ శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నాయి.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR(V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215